


# కేసీఆర్ బీమా.. ఇంటింటికీ ధీమా..

## ఆపత్కాలంలో అండగా సీఎం కేసీఆర్

- కుటుంబ పెద్దను కోల్పోయిన క్షణంలో ఆర్థిక భరోసా
- కారణంతో సంబంధం లేకుండా రూ.5లక్షల బీమా
- రూ.4వేల ప్రీమియం ప్రభుత్వమే చెల్లింపు
- తెల్లరేషన్ కార్డు ఉన్న పేదలంతా అర్హులే
- మ్యానిఫెస్టోలో పొందుపర్చిన బీఆర్ఎస్
- రైతుబంధు తరహాలోనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటన
- ఉమ్మడి జిల్లాలో 10.07 కుటుంబాలకు ప్రయోజనం

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్17(నమస్తే తెలంగాణ) : అది ప్రమాదమైనా, గుండెపోటైనా, ఇతర అనారోగ్య సమస్యలైనా, హఠాన్మరణమైనా... ఇలా కారణం ఏదైనా సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికీ బీమా సౌకర్యం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం. అందులో భాగంగానే రాష్ట్రంలోని బీపీఎల్ పరిధిలోకి వచ్చే 93లక్షల కుటుంబాలకు కేసీఆర్ బీమా పథకాన్ని పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కేసీఆర్ ప్రకటించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ప్రతి కుటుంబానికీ రూ.5లక్షల బీమా సొమ్మును చెల్లించేలా పథకం ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఇది కూడా అత్యంత విశ్వాసానికి మారుపేరైన ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ ద్వారానే అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. దీంతో ఎల్ఐసీపై ఉన్న నమ్మకంతో ఈ పథకం పకడ్బందీగా అమలుకానుందనడంలో సందేహం లేదు. ఇది దేశంలోనే అత్యంత మానవీయ పథకంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆపద సమయాల్లో కుటుంబానికి ఆర్థికంగా భరోసానిస్తూ అండగా నిలిచే పెద్దన్న పాత్రను సర్కార్ భుజాలకు ఎత్తుకుంటున్నందుకు సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. కేసీఆర్ బీమా పథకంతో ఉమ్మడి జల్లాలో ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం మొత్తం 10.07లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగనున్నది. వీరంతా ప్రస్తుతం బీపీఎల్ పరిధిలో ఉంటూ తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నారు. ఈ కార్డుదారుల్లోని కుటుంబ పెద్ద చనిపోతే ఈ పథకాన్ని వర్తింప చేయనున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే నల్లగొండలో 4.66లక్షల కుటుంబాలు, సూర్యాపేటలో 3.04లక్షల కుటుంబాలు, యాదాద్రి భువనగిరిలో 2.16లక్షల కుటుంబాలకు కేసీఆర్ బీమా పథకంలోకి రానున్నాయి. ఈ పథకం ద్వారా ఆయా కుటుంబాల్లోని సుమారు 25లక్షల మంది సభ్యులకు అపత్కాలంలో కేసీఆర్ బీమా ఉంటుందన్న భరోసా దొరకనున్నది. వాస్తవంగా ఇప్పటివరకు ముఖ్యంగా నిరుపేద, పేద కుటుంబాలకు బీమాపై కనీస అవగాహన కూడా ఉండడం లేదు. కుటుంబ పెద్ద బాగుండి పనిచేస్తున్నప్పుడు రోజువారీ జీవితం అలా గడిచిపోతూనే ఉంటుంది. ఉన్నట్టుండి ఏదైనా ఆపద సంభవించి పెద్ద దిక్కును కోల్పోతే రోడ్డు పడుతున్న కుటుంబాలెన్నో ఉన్నాయి. కుటుంబ పరిస్థితులే తారుమారై.. దిక్కులేని వారిగా మారుతున్నారు. కుటుంబ భారాన్ని మోయలేక, పిల్లలకు భవిష్యత్తును చూపలేక ఇల్లాలుకు నరకయాతన తప్పడం లేదు. ఇటువంటి సమయంలో ఆర్థిక భరోసా లభిస్తే ఆ కుటుంబం కొన్నాళ్లు మానసికంగా కోలుకుని మళ్లీ దారిన పడేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటి ఆపద సమయాల్లో ఆదుకునేందుకే కేసీఆర్ అద్భుత పథకం ప్రకటించారన్నది వాస్తవం.

కేసీఆర్ బీమా పథకాన్ని కూడా రైతుబంధు తరహాలోనే అమలు చేయనున్నట్లు సూచనప్రాయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మ్యానిఫెస్టోలో ప్రకటించారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక దీనిపై పూర్తి స్పష్టత రానుంది. విధివిధానాలు ఖరారు చేసి పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు ఉండనున్నట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్రంలో 2018 నుంచి అమలు చేస్తున్న రైతు బీమా తరహాలోనే దీన్ని కూడా ఎల్ఐసీ ద్వారానే అమలు చేయనున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. రైతు బంధు పథకానికి ప్రతియేటా ఆగస్టులో ప్రభుత్వం ప్రీమియం చెల్లింపులు చేస్తున్నది. ఏటేటా ప్రీమియం చెల్లింపులతో ఒక్కపైసా రైతులపై

### రైతుబంధు తరహాలోనే..

భారం పడకుండా దీన్ని అమలు చేస్తున్నది. రైతులు మరణిస్తే పక్షం రోజుల్లోనే పైరవీలకు తావు లేకుండా ఒక్క పైసా ఖర్చు లేకుండా నేరుగా ఐదు లక్షల బీమా సొమ్ము సంబంధిత కుటుంబం ఖాతాలో జమ అవుతున్నాయి. చనిపోయిన అనంతరం డెత్ సర్టిఫికెట్‌తో ఇతర ఆధారాలను సమర్పిస్తే నిర్ణీత గడువులోగానే బీమా సొమ్ము రైతులకు చెల్లిస్తున్నారు. రైతు బీమాను ఒక్క నల్లగొండ జిల్లాలో పరిశీలిస్తే.. 2018 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నాటికి మొత్తం 6,256 మంది రైతులు చనిపోతే వారికి 312.80కోట్ల రూపాయలను బీమా సొమ్ముగా ఆయా కుటుంబాలకు చెల్లించారు. ఇదే తరహాలో వచ్చే ఏడాది నుంచి కేసీఆర్ బీమా పథకం కూడా ఆపత్కాలంలో పేదల జీవితాల్లో భరోసా నిస్తుందనడంలో సందేహం లేదు. దీంతో కేసీఆర్ బీమా– ప్రతి ఇంటా ధీమా పథకం ప్రకటనపై ప్రశంసల జల్లు కురుస్తున్నది.

### పేదల గురించి ఆలోచించే నాయకుడు కేసీఆర్ సార్



సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో చాలా బాగుంది. కేసీఆర్ సారు మాటిచ్చిండంటే కట్టుబడి ఉంటారు. ఆయన ఆలోచనంతా పేద ప్రజల బాగు గురించే ఉంటది. కొత్తగా తీసుకొస్తున్న కేసీఆర్ బీమా పథకం ప్రతి పేద కుటుంబానికి ధీమాగా ఉంటుంది. చేతి కష్టం చేసుకునే కూలీలు, నెల జీతాలకు ఎదురుచూసే పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా తోడ్పాటు నిస్తుంది. ప్రభుత్వమే ఉచితంగా ప్రీమియం చెల్లించి 5 లక్షల బీమా కల్పించడం పేద కుటుంబాలకు భరోసా ఇచ్చినట్లే. ప్రజలకు కావాల్సినవన్నీ అమలు చేస్తున్న బీఆర్ఎస్ సర్కారుకు అండగా ఉంటాం.

– *యండీ ఫయాజ్, కొండమల్లేపల్లి*

### పేదల కష్టాలు తీర్చే మహానుభావుడు కేసీఆర్ సార్



కేసీఆర్ సార్ ఎన్నికల సందర్భంగా చాలా కొత్త పథకాలు తీసుకొచ్చిండు. అన్నీ చాలా బాగున్నాయి. ఒక కుటుంబానికి భరోసాగా కేసీఆర్ బీమా పథకం మేనిఫెస్టోలో పెట్టడం మంచి విషయం. మాలాంటి పేదలకు ఇది ఉపయోగపడుతుంది. కేసీఆర్ సార్ ఏ పథకం తీసుకొచ్చినా పేదల కోసమే. తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు.

–షేక్ ఖాసీం, కాశివారిగూడెం, తిప్పర్తి మండలం

### కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాం



కేసీఆర్ బీమా నిరుపేదలకు ధీమా. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి రూ.5లక్షల బీమా కల్పిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం ఆనందంగా ఉంది. మా గిరిజనతండాలో ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి. మా కుటుంబానికి భరోసాగా ఈ బీమా వరంలాంటిది. మేమంతా కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– పానుగోతు పకీరానాయక్, పానుగోతు తండా, త్రిపురారం

### పేద కుటుంబాలకు ఆసరా



బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన కేసీఆర్ బీమా పథకం పేద ప్రజలకు ఎంతో ధీమాను ఇస్తుంది. ఇప్పటివరకు రైతులకు, చేనేత కార్మికులకే పరిమితమైన ఈ పథకం బీపీఎల్ కుటుంబాలకు అమలు చేస్తానని చెప్పడం సంతోషదాయకం. పేదలు ఏకారణం చేతనైన చనిపోయినా 5లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. ఈ పథకంతో పేద కుటుంబాలకు భరోసా కలుగుతుంది. పేదల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– బద్దుల ఉమా, బోగారం, రామన్నపేట మండలం

# మన ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

- ఎమ్మెల్యే గాదరి కిశోర్
- శాలిగౌరారంలో సంబురంగా బతుకమ్మ వేడుకలు

శాలిగౌరారం, అక్టోబర్ 17 : తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మంగళవారం శాలిగౌరారంలో మండల కబడ్డీ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సతీమణి కమలతో కలిసి బతుకమ్మల చుట్టూ ఆట ఆడి పాడారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరు కాగా బతుకమ్మ పాటలతో సందడి నెలకొన్నది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మను రాష్ట్ర పండుగగా జరుపుకుంటూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. అనంతరం బతుకమ్మలను మంచిగా పేర్చిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కందుల అనిత, ఏఎంసీ చైర్మన్ మామిడి తేజస్వి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, చాడ హతీశ్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, తాళ్లూరి మురళి, మామిడి సర్వయ్య, నూక సత్తయ్యయాదవ్, కిరణ్‌కుమార్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ అయితగోని సునీత, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కల్లూరి నాగరాజుగౌడ్, జెర్రిపోతుల మంజుల, గుజిలాల్ శేఖర్‌బాబు, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్, కంబాలపెల్లి కృష్ణ, శానాల యుగేందర్‌రెడ్డి, గంట శంకర్, బట్ట వీరబాబు, చిరబోయిన శ్రీనివాస్, చివుట సైదులు పాల్గొన్నారు.



శాలిగౌరారంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, ఆయన సతీమణి కమల